
ప్రజాశక్తి
గురువారం 2 జనవరి 2025
5
విజయనగరం



3న సహారా బాధితుల ర్యాలీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఈ నెల మూడో తేదిన సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించే సహారా బాధితుల ర్యాలీని విజయవంతం చేయాలని సహారా ఖాతాదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.సూరిబాబు, మండల అధ్యక్షులు ఎస్.కె ఖాన్ కోరారు. బుధవారం పట్టణంలోని మహాత్మా గాంధీ పార్కు ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సహారా ఖాతాదారులకు ప్రతి బాండుకు ఏకమొత్తంలో పేమెంటు చేయాలని డిమాండ్‌చేశారు. సిఆర్‌సిఎస్ పోర్టల్‌లో వచ్చిన ఎఒఎఫ్, ఎంఒఎఫ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. వీటిపై పట్టణంలోని సహారా కార్యాలయం నుంచి దేవి కూడలి మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు బాధితులతో ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా చేస్తామని తెలిపారు.

నూతన సంవత్సర సందడి

- మంత్రి, ఎమ్మెల్యేల నివాసాలకు క్యూకట్టిన నాయకులు, అధికారులు
- కోలాహలంగా మారిన క్యాంపు కార్యాలయాలు




కేంద్రమాజీమంత్రి అశోక్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, లోకం నాగ మాధవి, అదితి గజపతిరాజు

నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా అంతటా సందడి నెలకొంది. ప్రజాప్రతినిధులకు, జిల్లా ఉన్నతాధికారులకు, రాజకీయ నాయకులకు ఉద్యోగులు, సిబ్బంది, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు, పండ్లు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈనేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేల నివాసాలు, క్యాంపు కార్యాలయాలు, కలెక్టర్, ఎస్‌పి కార్యాలయాలు జనాలతో కళకళలాడాయి. విజయనగరంలోని రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ నివాసం వద్ద అధికారులు, టిడిపి నాయకులు క్యూ కట్టారు. అలాగే కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను కలిసేందుకు అధికారులు, అశోక్‌బంగ్లాలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపేందుకు అధికారులు, నాయకులు, కార్యకర్తలు క్యూ కట్టారు. మరోవైపు స్నేహితులు, సహోద్యోగులు, సాధారణ ప్రజలు సైతం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మంత్రి శ్రీనివాస్‌ను బుధవారం స్థానిక ఎమ్మెల్యేలు పూసపాటి అదితి గజపతిరాజు, లోకం నాగమాధవి తోపాటు జిల్లాలోని పలువురు అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి, టిడిపి జిల్లా అధ్యక్షుడు నాగార్జున తదితరులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో మరెన్నో విజయాలను సాధించాలని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు కలిసి పూల బొకేల బదులు పుస్తకాలు, పెన్నులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వేలాదిగా ప్రజలు తరలిరావడంతో మంత్రి నివాస పరిసర ప్రాంతాలు సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఆరునెలల క్రితం అధికారంలో కొచ్చిన కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేసిందని, గాడితప్పిన పాలనను గాడిలో పెట్టిందన్నారు. ఈ నూతన సంవత్సరంలో రాష్ట్రంలో అభివద్ధి , సంక్షేమం పరుగులు పెడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ నూతన సంవత్సరంలో రాష్ట్రంలో ప్రజలు సరికొత్త ఆశలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని కోరారు. సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ప్రజలు జీవించాలని, 2025లో ప్రతి ఇంట్లో ఆనందాలు, అభివద్ధి కాంతులు వెల్లి విరియాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. గజపతినగరంలోని టిడిపి కార్యాలయ ప్రాంగణంలో మంత్రి శ్రీనివాస్‌కు నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్ అంబేద్కర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జెసి సేతు మాధవన్, ఉన్నతాధికారులు

జూనియర్ కళాశాలల్లో రేపటి నుంచి మధ్యాహ్న భోజనం

4660 మంది విద్యార్థులకు లబ్ధి



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో ఇంటర్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ప్రభుత్వ కాలేజీల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక జీవోను విడుదల చేసింది. విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజనం ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. 2025 జనవరి 1 నుంచి 475 జూనియర్ కాలేజీల్లో కొత్త సంవత్సరం కానుకగా ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించనున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఈ పథకానికి మొత్తం రూ. 115 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. జిల్లాలో జనవరి 3 తేదీ నుంచి జూనియర్ కళాశాల లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ విద్యా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. విజయనగరం జిల్లాలో 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో మొదటి ఏడాది విద్యార్థులు 2650మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2010 మంది చదువుతున్నారు. మొత్తంగా 4660 మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా మధ్యాహ్న భోజన పథకం అమలు కానుంది. మొత్తం 18 కళాశాలలకు గాను 9 కళాశాలల్లో అక్షయపాత్ర ఫౌండేషన్, మిగిలిన 9 కళాశాలల్లో ఆయా కళాశాలలకు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పథకం నిర్వహిస్తున్న ఎస్‌హెచ్‌జి గ్రూపుల ద్వారా భోజనం సిద్ధం చేయనున్నారు.

డ్రాపౌట్లను తగ్గించడమే లక్ష్యం

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్లో హాజరు శాతాన్ని మెరుగుపరచడం, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెబుతుంది. అదే విధంగా పనితీరు ఆధారంగా ప్రభుత్వ విద్యా సంస్థలకు రేటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కూడా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పేదరికం కారణంగా పదో తరగతి తర్వాత విద్యార్థులు ఇంటర్ చదువుకు దూరమవుతున్న తీరును ప్రభుత్వం పరిశీలించి, విద్యార్థులు ఇంటర్‌తో పాటు ఉన్నత చదువులు చదివేలా ప్రభుత్వం ప్రోత్సహించడం లో భాగంగా భోజన పథకం అమలు చేస్తున్నట్లు ప్రకటించింది.

వెనుకబడిన విద్యార్థులపై పర్యవేక్షణ

ఇంటర్‌లో వెనుకబడిన విద్యార్థులకు క్వశ్చన్ బ్యాంక్, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే చదవడంలో వెనకబడిన విద్యార్థులను పర్యవేక్షించేందుకు కళాశాలల లెక్చరర్లు, సిబ్బందిని కేర్‌టేకర్లుగా నియమించాలని అధికారులను ఆదేశించారు.

మెనూ ఇలా...

సోమవారం : ఉడికించిన గుడ్డు/వెజిటబుల్ పలావు, కోడిగుడ్డు కూర, వేరుశనగ చిక్కీ

మంగళవారం : ఉదయం రాగిజావ, మధ్యాహ్నం చింతపండు పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడి గుడ్డు.

బుధవారం : వెజిటేబుల్ రైస్, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరు శనగ చిక్కీ.

గురువారం : ఉదయం రాగిజావ, మధ్యాహ్నం సాంబార్ బాత్ / లెమన్ రైస్, టొమాటో పచ్చడి, ఉడికించిన కోడి గుడ్డు.

శుక్రవారం : అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడి గుడ్డు, వేరుశనగ చిక్కీ.

శనివారం : ఉదయం రాగిజావ, మధ్యాహ్నం ఆకుకూరతో చేసిన అన్నం, పప్పుచారు, స్వీట్ పొంగల్.

అమలుకు సర్వం సిద్ధం



జిల్లాలో అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుకు చర్యలు తీసుకున్నాం. ఈ నెల 3 నుంచి జిల్లాలో అమలు జరుగుతుంది. పేద, సామాన్య విద్యార్థులను ప్రోత్సహించి ఉన్నత చదువులకు ఆటంకం లేకుండా చేయడమే ఈ పథకం లక్ష్యం.

- ఎం.ఆదినారాయణ, ఆర్ఐఒ

న్యూ ఇయర్ కిక్

- కొత్త సంవత్సరాన తప్పతాగిన మందుబాబులు
- ఒక్కరోజే రూ.9.37 కోట్ల మద్యం విక్రయం
- క్రయ, విక్రయాలకు రాత్రి ఒంటి గంట వరకు అనుమతి



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను...! ఆ ఒక్కరోజే రూ.9.37కోట్ల విలువైన మద్యాన్ని మందుబాబులు తాగేశారు. అదును చూసి పదును పెట్టాలన్నట్టుగా ప్రభుత్వం కూడా మందుబాబులు, సరదా సందళ్లను ఆసరా చేసుకుని విక్రయాలకు సమయాన్ని పొడిగించింది. నూతన సంవత్సరానికి స్వాగతం పలికే పేరుతో డిసెంబర్ 31వ తేదీన జనం అర్ధరాత్రి వరకు వేచివుంటారన్న సంగతి తెలిసిందే. ఈ పేరుతో అప్పటి వరకు కాలక్షేపం చేయడం, మద్యం ప్రియులు ఫుల్ జోష్‌తో పూటుగా తాగడం కూడా పరిపాటిగా మారిపోయింది. ఈ ఏడాది ఇటువంటి సంస్కృతి మరింతగా పెరిగిపోయింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో రూ.9.37కోట్ల మద్యాన్ని సేవించడం ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. మద్యం దుకాణాల్లో నిరంతరం అన్ని రకాల బ్రాండ్లు అందుబాటులో ఉంటాయి. కానీ, మంగళవారం ఒక్కరోజే నెల్లిమర్లలోని ఎపి బేవరేజెస్ డిపో నుంచి 6.50కోట్ల మద్యాన్ని దుకాణదారులు తీసుకెళ్లారట. మిగిలిన మద్యం అప్పటికే దుకాణాల్లో ఉన్న స్టాక్ అని అర్థం చేసుకోవచ్చు. మొత్తం సేల్ అయిన మద్యంలో జిల్లాల వారీగా పరిశీలిస్తే విజయనగరం జిల్లాలో అత్యధికంగా రూ.7.21కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.2.16కోట్ల మద్యం ఉన్నట్టుగా ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులోనూ విజయనగరం పట్టణంలో ఎక్కువగా మద్యం విక్రయాలు జరిగాయి. ఆ తరువాత స్థానాల్లో పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, పాలకొండ, రాజాం, నెలిమర్ల, గజపతినగరం, ఎస్.కోట తదితర పట్టణ కేంద్రాలు ఉన్నాయి. దాదాపు అన్ని దుకాణాలూ మంగళవారం ఉదయం నుంచే మద్యం ప్రియులతో కిటకిటలాడాయి. సాయంత్రం అయ్యేసరికి కొన్ని దుకాణాల్లో క్యూలైన్లు, తోపులాటలు వరకు వచ్చింది. రాత్రి 9గంటలకు మూసేయవాల్సిన దుకాణాలను అర్ధ రాత్రి ఒంటిగంట వరకు తెరుచుకునేందుకు సాక్షాత్తు ప్రభుత్వమే అవకాశం ఇవ్వడంతో అప్పటి వరకు విక్రయాలు కొనసాగాయి. మద్యం విక్రయాలను ప్రభుత్వం ప్రధాన ఆదాయ వనరుగా మారడంతో క్రయ, విక్రయాలకు బార్లు తెరించిందని పలువురు విమర్శిస్తున్నారు.

మందుబాబు హల్‌చల్

విద్యుత్తు తీగలపై నిద్ర

ప్రజాశక్తి -పాలకొండ

మండలంలోని ఎం.సింగుపురం గ్రామానికి చెందిన బి.వెంకటరమణ తప్పతాగి మద్యం మత్తులో మంగళవారం సాయంత్రం గ్రామంలో హల్‌చల్ చేశాడు. పూటుగా మద్యం సేవించి విద్యుత్ స్తంభం ఎక్కి ఏకంగా విద్యుత్ తీగల మీద పడుకున్నాడు. స్తంభం ఎక్కుతుండగా స్థానికులు గుర్తించి వెంటనే లైన్‌మెన్ సూర్యారావుకు సమాచారం అందించారు. దీంతో ఆయన వెంటనే విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో ఎటువంటి ప్రమాదమూ జరగలేదు. తరువాత స్థానికులు ఆయనను కిందకు దించారు. వెంకటరమణ తల్లికి సామాజిక పింఛను అందడంతో తల్లితో గొడవ పడి ఆమె వద్ద డబ్బులు తీసుకుని వెళ్లి పూటుగా మద్యం సేవించాడని స్థానికులు చెప్తున్నారు. వెంకటరమణ కూడా స్థానికంగా విద్యుత్ పనులు చేస్తూ గ్రామంలో ఉంటున్నాడు.



విద్యుత్తు తీగలపై నిద్రపోతున్న మందుబాబు

కరుడుగట్టిన మతోన్మాది అమిత్‌షా



నిరసన తెలుపుతున్న సిపిఎం, కెవిపిఎస్ నాయకులు, స్థానికులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్‌ను అవహేళనగా మాట్లాడిన అమిత్ షా కరుడుగట్టిన మతోన్మాదని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల కార్యదర్శి గొల్ల సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బుధవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించిన మతోన్మాది అమిత్‌షా వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో జి.నాయుడు, ఎల్.సాయి, కక్కల సూరి, కండిపిల్లి కృష్ణ, తొత్తడి భారతి, తొత్తడి ముత్తమ్మ, మద్దిల కొండమ్మ, తొత్తడి సన్యాసమ్మ, తొత్తడి చిన్నభారతి, మద్దిల చక్రి, కక్కల రమణ, కక్కల రవి, ముదపాక లీల, తొత్తడి గౌతమ్, రాంబాబు పాల్గొన్నారు.

3న రవాణా రంగ సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 3న విజయనగరం జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవనంలో రవాణా రంగ సదస్సు జరుగనుందని జాతీయ కౌన్సిల్ ఎ.జగన్మోహన్‌రావు తెలిపారు. ఈనెల 8,9 తేదీల్లో విజయవాడలో ఆలిండియా వర్కింగ్ కమిటీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో 'రవాణా రంగ సవాళ్లు- ప్రభుత్వ విధానం- ఎఐఆర్‌టి డబ్ల్యూఎఫ్ వైఖరిపై జరిగే సదస్సుకు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య ముఖ్య వక్తగా హాజరవుతున్నారని తెలిపారు. ఆటో ,లారీ, మినీవ్యాను, క్యాబ్, లగేజ్ గూడ్స్ వెహికల్స్ డ్రైవర్లను కలిసి కరపత్ర ప్రచారం నిర్వహించారు. రవాణా రంగ కార్మికులందరికీ కేరళ తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెంచిన ఫీజులు ,పెనాల్టీలు, టోల్ ఛార్జీలు, గ్రీన్ టాక్స్ రద్దు చేయాలని, రాష్ట్ర రహదారులపై టోల్ గేట్లు ఎత్తివేయాలని, ఆటోలకు పార్కింగ్ స్థలాల కేటాయించాలని ,ఈ చలానాల రద్దు చేయాలని , పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని , వాహన రిజిస్ట్రేషన్ మరియు డ్రైవింగ్ లైసెన్సులను ప్రైవేటు సంస్థలకు అప్పచెప్పద్దని డిమాండ్ చేస్తూ ఈ సదస్సు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రవాణా రంగ కార్మికులు పాల్గొన్నారు.



సదస్సు కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేస్తున్న నాయకులు జగన్మోహన్‌రావు

సంక్రాంతి సరుకులు లేనట్టే!

- ప్రభుత్వ కానుకలపై ప్రజల్లో ఆశలు
- నేటికీ ప్రకటించని సర్కారు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

చౌక ధరల దుకాణాల ద్వారా త్వరలో రానున్న సంక్రాంతికి ప్రత్యేక సరుకులు లేనట్టే. దీంతో, రాష్ట్ర వ్యాప్తంగా 1,48,5,194 మంది, ఉమ్మడి విజయనగరం జిల్లాలో 8,63,007 మంది తెల్లరేషన్‌కార్డుదారులు నిరాశ చెందుతున్నారు. క్రిస్మస్ నేపథ్యంలోనూ ప్రత్యేక సరుకులు అందుబాటులోకి తేకపోవడంతో ఇక నుంచి సంక్రాంతి, రంజాన్ పండగలకు అటువంటి ఆశపెట్టుకోనక్కర్లేదని అర్థమౌతోంది. పండగ నేపథ్యంలో ప్రత్యేక సరుకుల విషయమై ఇప్పటి వరకు తమకు ఎలాంటి సమాచారం లేదని సివిల్ సప్లయి అధికారులు కూడా స్పష్టం చేస్తున్నారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి టిడిపి ప్రభుత్వం క్రిస్మస్, సంక్రాంతి కానుకలు, రంజాన్ తోఫా పేరిట బియ్యం, కందిపప్పుతోపాటు అర కేజీ బెల్లం, కేజీ పంచదార, కేజీ గోదుమపిండి, లీటరు ఆయిల్ ప్యాకెట్, నెయ్యి వంటివి అందజేసేది. ఆ తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ సంప్రదాయాన్ని పూర్తిగా పక్కనబెట్టింది. దీంతో, గడిచిన ఐదేళ్లపాటు సిఎం చంద్రబాబు (నాడు ప్రతిపక్ష నేత హోదాలో) సంక్రాంతి సీజన్‌లో జగన్ ప్రభుత్వం సంక్రాంతి సరుకులు కూడా ఇవ్వలేదని, తాను అధికారంలో ఉన్నన్నాళ్లూ సంక్రాంతి, క్రిస్మస్ కానుకలు ఇచ్చేవాడినని పదేపదే విమర్శలు చేస్తుండేవారు. దీంతో, ఈ అంశాన్ని ఎన్నికల హామీలో పెట్టినప్పటికీ, సరుకులు ఎప్పటి మాదిరిగానే ఇస్తారనే దీమాతో జనం ఇప్పటి వరకు ఉన్నారు. కానుకల విషయమై ఇప్పటికీ ఉలుకూ పలుకూ లేకపోవడం, వారం రోజుల క్రితం జరిగిపోయిన క్రిస్మస్ సందర్భంగాను అటువంటి సంప్రదాయం కనిపించకపోవడంతో తెల్లరేషన్ కార్డుదారుల ఆశలు ఆవిరవుతున్నాయి.

విజయనగరం జిల్లాలో 5,81,728 మంది తెల్లరేషన్‌కార్డుదారులు, పార్వతీపురం మన్యం జిల్లాలో 2,81,279 మంది కార్డుదారులు ఉన్నారు. 2014నాటికి ముందు ఏ ప్రభుత్వం ఉన్నా సంక్రాంతి సందర్భంగా కనీసం ఆయిల్, బెల్లం అయినా ఇచ్చేవారని, ఈసారి గత ప్రభుత్వం మాదిరిగానే మొత్తానికి ఎసరు పెట్టిందని చర్చించుకుంటున్నారు. అసలే నూనె, పప్పుదినుల ధరలు పెరిగాయి. ముఖ్యంగా రైతు కుటుంబాలకు వ్యవసాయ పెట్టుబడి పెరిగింది. ఎన్నికల హామీలో భాగంగా చెప్పిన వ్యవసాయ పెట్టుబడి రూ.20వేలు ఇవ్వలేదు. ఈ నెలలో కురిసిన ఎడతెరిపిలేని వర్షాల బారి నుంచి చేతికందిన వరి, తదితర పంటను కాపాడుకునేందుకు రైతులు అదనపు పెట్టుబడి పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మినుములు, పెసలు వంటి అపరాల పంటలు దెబ్బతిన్నాయనే బాధల్లో రైతాంగం ఉంది. మరోవైపు వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలకు పనిలేకుండా పోయింది. గడిచిన రెండదు నెలలుగా విద్యుత్ ఛార్జీల భారం పెరిగింది. ఇదే భారంతో విజయనగరం జిల్లాలోని గడిచిన ఆరు నెలల్లో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు తమ ఉత్పత్తిని తగ్గించుకోవడంతో ఆ మేరకు వాటిలో పనిచేసిన కార్మికులు జీవనోపాధి కోల్పోయారు. ఇటువంటి పరిస్థితుల్లో సంక్రాంతికి ఉచిత సరుకులు ఇవ్వకపోవడం బాధాకరమని జనం చర్చించుకుంటున్నారు.

కార్మికులకు అన్యాయం చేయొద్దు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జ్యూట్ యాజమాన్యం గోనెల కొనుగోలు ఆర్డర్ పేరిట కార్మికులకు అన్యాయం చేయవద్దని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు కోరారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 7 నెలలుగా మిల్లు లాకౌట్ చేయడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జ్యూట్ యాజమాన్యం గోనె సంచుల కొనుగోలు ఆర్డర్ కావాలని చెప్పడం భావ్యం కాదన్నారు. ఇప్పటికే జ్యూట్ యాజమాన్యం కార్మికుల నుంచి అప్పుగా రూ.5.10 లక్షలు తీసుకుని, ఇంతవరకూ చెల్లించలేదని తెలిపారు. రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యుటీ బకాయిలు కూడా చెల్లించలేదని తెలిపారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, జ్యూట్ యాజమాన్యంపై చర్యలు తీసుకొని మిల్లు తెరిపించి, కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.



మోడల్ పేపర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ మోడల్ పేపర్లు విడుదల

ప్రజాశక్తి-కొత్తవలస

పదో తరగతి విద్యార్థుల కోసం యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస, లక్కవరపుకోట ఎంఇఒలు బండారు శ్రీనివాసరావు, చలుమూరు కూర్మారావు, యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.నిర్మలదేవి, జి.విజయగౌరి, గౌరవ అధ్యక్షులు ఎన్.ఎస్.ప్రసాద్, జిల్లా సహాధ్యక్షులు జి.పార్వతి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జి.వెంకటి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శ్రామికుల పక్షాన నిలిచేది కమ్యూనిస్టులే

ప్రజాశక్తి-బొబ్బిలి

శ్రామికుల పక్షాన నిలిచి, నికరంగా పోరాటాలు చేసేది కమ్యూనిస్టులేనని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కండాపు ప్రసాదరావు తెలిపారు. సిపిఐ వందో వార్షికోత్సవ వాల్‌పోస్టర్లను స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల నిర్బంధాలకు, నిరంకుసత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ఎన్నో విరోచిత పోరాటాలు సాగించారని గుర్తుచేశారు. సమాచార హక్కుల చట్టం. అటవీ హక్కుల చట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టం, బ్యాంకుల జాతీయకరణ, తదితర చట్టాలు కమ్యూనిస్టుల చొరవ వల్లే వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్. నాయకులు వై.బాబ్జి, ఎస్.సింహాచలం సత్యనారాయణ పాల్గొన్నారు.

'పల్లి' సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- మెంటాడ

కీర్తిశేషులు పల్లి తిరుపతిరావు సేవలు మరువలేనివని జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షులు గంధ్రేటి లక్ష్మణరావు తెలిపారు. బుధవారం మండలంలోని గుర్ల గ్రామంలో సామాజిక సేవకులు పల్లి తిరుపతిరావు 62వ జయంతి సందర్భంగా జనవిజ్ఞానవేదిక, సిపిఎం ఆధ్వర్యంలో సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్లగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం కోసం తిరుపతిరావు అహర్నిశలు కృషి చేశారని గుర్తుచేశారు. గుర్ల గ్రామానికి శ్రమదానంతో రహదారి నిర్మాణం కల్పించారని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు, జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి గంధ్రేటి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కేలెండర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం విజయనగరం జిల్లా కలెక్టర్ .అంబేద్కర్‌ను, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును, సిఇఒను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ టేబుల్ కేలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టి.శ్రీధర్ బాబు, జిల్లా కార్యదర్శి ఎ.సురేష్, టౌన్ అధ్యక్షులు వై. ఆనంద్ కుమార్, టౌన్ కార్యదర్శి ఎ. కనకరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ 2025 కేలెండర్‌ను బుధవారం రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముువ్వల అమర్ నాథ్ విజయనగరం జిల్లా గౌరవధ్యక్షులు ఆసరి తవిటందొర, కోశాధికారి మేకల సత్యనారాయణ , సంఘ సభ్యులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ కార్యక్రమానికి హాజరైన పేదలు

వెయ్యి మందికి దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలోని ఆరికతోట ఎడిఎం బాప్టిస్ట్ చర్చి పెద్దల ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది పేదలకు రూ.2 లక్షల విలువైన వస్త్రాలు పంపిణీ చేశారు. చర్చి కార్యదర్శి పెంకి జార్జ్ ఎబినైజర్, సంఘ కాపరి సురేష్ కుమార్, మాజీ సర్పంచ్ పెంకి భీమయ్య ఆధ్వర్యంలో స్థానిక చర్చి గ్రౌండ్లో అన్నదానం నిర్వహించారు. అనంతరం వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంకి పుష్పమ్మ, పెద్దలు పెంకి రవికుమార్, బాబ్జీ, వార్డ్ మెంబర్ సీమాన్, సున్నపు అశోక్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : సారిపల్లిలో 180 మంది పేదలకు చీరలు, దుప్పట్లను సర్పంచ్ రాయి పైడమ్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాయి విభీషణరావు, నాయకులు నడిపేన ఆనంద్, జగ్గుబిల్లి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పైడమ్మ

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గజపతినగరం

మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద బుధవారం లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ కె.లక్ష్మణరావు కథనం ప్రకారం.. గంగచోళ్లపెంట గ్రామానికి చెందిన కనకల లక్ష్మణనాయుడు (45) గజపతినగరంలో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. సైకిల్‌పై మధ్యాహ్న భోజనానికి వెళ్లే సమయంలో మానాపురం నుంచి వస్తున్న లారీ ఆయన్ను ఢీకొంది. దీంతో అక్కడికక్కడే ఆయన మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యూ ఇయర్ సందడి



మంత్రి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్‌పి కలిశెట్టి



మంత్రి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున



నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



కార్యకర్తకు కేక్ తినిపిస్తున్న రాజాం ఎమ్మెల్యే మురళీమోహన్



ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి దంపతులకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు



బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయనకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు



మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



విజయనగరం ఎమ్మెల్యే అదితికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



కలెక్టర్‌కు పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ విజయలక్ష్మి



కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు



న్యూఇయర్ వేడుకల్లో జనసేన నాయకులు అవనాపు విక్రమ్ దంపతులు



వేపాడ ఎంపిడిఒకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

రూ.కోట్లు వెచ్చించారు..
నిరుపయోగంగా వదిలేశారు

డ్రైవర్లకు ఉపయోగపడని హైవే విశ్రాంతి స్థలం ● వెళ్లేందుకు కానరాని రహదారి

ప్రజాశక్తి-భోగాపురం

నిత్యం తిరిగే వాహనాల డ్రైవర్లు సేద తీరేందుకు రూ.కోట్లు వెచ్చించి జాతీయ రహదారి పక్కనే విశ్రాంతి గదులు నిర్మించారు. కానీ ఆ వాహనాలు హైవేపై నుంచి ఈ విశ్రాంతి స్థలంలోకి వెళ్లేందుకు అవకాశం లేకుండా చేశారు. కేవలం హైవే సర్వీస్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వాహనాలు మాత్రమే వెళ్లేందుకు అవకాశం ఉంది. హైవే పైనుంచి వెళ్లే వాహనాల డ్రైవర్లు కొంతమంది జాతీయ రహదారిపైనే తమ వాహనాలను నిలిపేయడం ప్రమాదాలకు దారితీస్తోంది. దీంతో భోగాపురం సమీపంలోని సిమ్మపేట వద్ద నిర్మించిన విశ్రాంతి స్థలం నిరుపయోగంగా మారింది.

జాతీయ రహదారి-16పై నుంచి వెళ్లే వాహనదారులు తమ వాహనాలను నిలిపి, కొంతసేపు సేద తీరేందుకు, స్నానాలు చేసుకునేందుకు వీలుగా హైవేకు ఆనుకుని కొన్ని చోట్ల విశ్రాంతి భవనాలు, స్థలాలను నిర్మించారు. ఇందులో వాహనం కూడా నిలుపుకునేందుకు భారీ స్థలం, డ్రైవర్లు తమ కాలకృత్యాలు తీర్చుకునేందుకు అవకాశం కల్పించారు. భోగాపురం సమీపంలోని సిమ్మపేట వద్ద రూ.కోట్లు వెచ్చించి స్థల సేకరణ చేసి మరీ నిర్మించారు. ఇది వాహనదారులకు ఎంతో సదుపాయంగా ఉంటుందని ఊహించారు. జాతీయరహదారిపై నుంచి వెళ్తున్న వాహనాల డ్రైవర్లు ఈ విశ్రాంతి స్థలంలోకి వెళ్లి, సేద తీరాలంటే చాలా కష్టమే. ఎందుకంటే ఇందులోకి వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేదు. ఒకవేళ తగరపువలస వైపు నుంచి వచ్చే వాహనదారులు సుమారు ఎనిమిది కిలోమీటర్ల ముందు లింగాలవలస జంక్షన్ సమీపంలో భోగాపురం వెళ్లే సర్వీసు రహదారిలోకి రావాలి. అక్కడ నుంచి భోగాపురం సమీపంలోని అక్కివరం కూడలిలోని వంతెన కింద నుంచి మళ్లీ తగరపువలస వెళ్లే వైపు సర్వీసు రహదారిలో కిలోమీటరు వెళ్లాల్సిన పరిస్థితి. శ్రీకాకుళం వైపు నుంచి వస్తున్న వాహనదారులు భోగాపురం వంతెన ముందు సర్వీసు రహదారిలోకి వచ్చి ఇక్కడికి చేరుకోవాలి. సుదూర ప్రాంతాల నుంచి, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే వాహనదారులకు ఇలా వెళ్లాలని ఎలా తెలుస్తుంది? అన్నది ప్రశ్నార్థకమే. విశ్రాంతి భవనానికి వెళ్లాలంటే ఇక్కడ నుంచే వెళ్లాలని కనీసం బోర్డులు కూడా లేవు. కాని సిమ్మపేట వద్ద మాత్రం బోర్డులు ఏర్పాటు చేసి వాటిని కప్పేశారు.



పార్కింగ్ స్థలం లేక హైవేపై నిలిపివేస్తున్న వాహనాలు



విశ్రాంతి స్థలానికి వెళ్లేందుకు అడ్డంగా ఉన్న సర్వీస్ రహదారి రెయిలింగ్

హైవేపైనే వాహనాలు

డ్రైవర్లు సేదతీరేందుకు జాతీయ రహదారిపైనే విచ్చలవిడిగా వాహనాలను నిలిపేస్తున్నారు. ముఖ్యంగా లింగాలవలస కూడలి వద్ద మరీ ఘోరంగా ఉంటుంది. ఇక్కడ హైవే పోలీసులు ఉన్నా పట్టించుకోరన్న విమర్శలు ఉన్నాయి. వివిధ చోట్ల ఇష్టానుసారంగా నిలిపివేస్తుండడంతో వెనుక నుంచి వస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల భోగాపురంలోని సిమ్మపేట పెట్రోల్ బంకు వద్ద ఇసుక లారీ ఇలా అగిందో లేదో వెనుక నుంచి వచ్చిన వ్యాన్ బలంగా ఢీకొట్టడంతో డ్రైవరు సజీవదహనమయ్యాడు. అందుకే ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు విశ్రాంత స్థలాలను ఉపయోగిస్తే బాగుంటుందని పలువురు అంటున్నారు.

సర్వీస్ రోడ్డు లేనిచోట నిర్మిస్తే బాగుండేది



భోగాపురంలో నిర్మించిన విశ్రాంతి స్థలం వద్ద రహదారి సౌకర్యం లేదు. అక్కడ ఒకవేళ విశ్రాంతి స్థలానికి వెళ్లేందుకు కటింగ్ ఇచ్చినా ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉంది. సర్వీస్ రోడ్డు లేని చోట నిర్మించి ఉంటే ఎంతగానో ఉపయోగపడేవి. హైవేపై వాహనాలు ఎక్కువ సేపు వాహనాలు నిలిపివేయకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- ఎన్.వి.ప్రభాకర్, సిఐ, భోగాపురం

గ్రీన్‌ఫీల్డ్ రహదారితో ఇక్కట్లు

- భారీ వాహనాల రాకపోకలతో అధ్వానంగా రహదారులు
- సర్వీస్ రోడ్డు లేక రైతులకు పాట్లు

ప్రజాశక్తి-మెంటాడ

గ్రీన్‌ఫీల్డ్ రహదారి రైతులకు, ప్రజలకు కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం కోసం భారీ వాహనాల రాకపోకలతో పంచాయతీ రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. మరోవైపు పొలాల్లో పంటలను తెచ్చుకునేందుకు వెళ్లే అవకాశం లేకుండా గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రాయ్‌పూర్ నుంచి సబ్బవరం వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి మెంటాడ మండలంలోని పలు గ్రామాల మీదుగా వెళ్తుంది. గ్రీన్‌ఫీల్డ్ రహదారి, ఫైనాన్స్ కారిడార్ కోసం మెంటాడ గ్రామంలో సుమారు 120 ఎకరాల వరకు సేకరించారు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ రహదారి నిర్మాణంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. నిత్యం ఈ రహదారి మీదుగా సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధూళి, మట్టి వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పంచాయతీ రహదారులపై ఎక్కడికక్కడ పెద్ద గోతులు ఏర్పడటంతో వాహనాలు సైతం దెబ్బతింటున్నాయని పలువురు డ్రైవర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వెంటనే పాడైపోయిన రహదారులను బాగుచేయాలని కోరుతున్నారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంలో రైతుల విన్నపాలు, కష్టాలు పట్టించుకోలేదు. గతంలో ఉన్న దారులన్నీ మూతపడ్డాయి. దీంతో రహదారికి అవతల వైపు ఉన్న పొలాల నుంచి పంటను తెచ్చుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రింగ్‌రోడ్డుకు ఆనుకొని మర్రివలసకు రహదారి ఇప్పించాలని పలుమార్లు ఆందోళనలు చేపట్టినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రజల అవసరాలను పట్టించుకోకుండా అధికారులు కూడా గ్రీన్‌ఫీల్డ్ రహదారి కాంట్రాక్టరుకు వత్తాసు పలకడం విడ్డూరం. ఇప్పటికైనా రైతులు, ప్రజల అవసరాలు దృష్టిలో ఉంచుకుని అధికారులు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.



గ్రీన్‌ఫీల్డ్ రహదారి

మర్రివలస వద్ద హైవేపైకి వెళ్లేందుకు అవకాశం లేకుండా ఇలా వదిలేశారు

ఆక్రమణకు గురైన ప్రభుత్వ బాట

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కేజీపూడి రెవెన్యూ పరిధిలో గల రాము నాయుడు చెరువుకు ఆనుకొని సర్వే నెంబరు 91లో 1.10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ బాట ఆక్రమణకు గురైంది. ప్రభుత్వానికి చెందిన ఈ బాట రైతులు పొలాలకు వెళ్లి వచ్చేందుకు అనువుగా ఉండేది. రైతులు పొలాల్లోకి వెళ్ళకుండా స్థిరాస్తి వ్యాపారస్తులు వారికి అనుకూలంగా ఈ బాటపై ఒక గేట్ ఏర్పాటు చేశారు. దీంతో రైతుల పంట పొలాల్లో నుంచి పండించే పంటలను కల్లాలకు తెచ్చుకునే అవకాశం లేకుండా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామ రెవెన్యూ అధికారి అప్పారావును వివరణ కోరగా పరిశీలించి నివేదికను తహశీల్దార్‌కు అందజేస్తామన్నారు.



రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన గేటు

కూలడానికి సిద్ధంగా కల్వర్టు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బల్లంకి, ఆనందపురం గ్రామాల మధ్య రైవాడ కాలువ దాటడానికి నిర్మించిన కల్వర్టు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. బల్లంకి రెవెన్యూ పరిధిలో ఉన్న ఈ కల్వర్టు మీదుగా నిత్యం విద్యాసంస్థలకు సంబంధించిన బస్సులు, విశాఖపట్నం, అనకాపల్లి, దేవరపల్లి వెళ్లడానికి విశాఖ డైరీ పాల వ్యాన్ తిరుగుతూ ఉంటాయి. ప్రైవేటు బస్సులు, ఆటోలపైన ఈ క్వలర్టు మీదుగానే ఎం. సింగవరం, పోతంపేట, బాణాది, బల్లంకి గ్రామాలకు ప్రయాణాలు చేస్తుంటారు. అయితే శిథిలావస్థఖు చేరిన కల్వర్టు ఎప్పుడు కూలిపోతుందోనని భయంతోనే ప్రయాణాలు సాగిస్తున్నామని ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన కల్వర్టు